క్లుప్తంగా

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు



ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డిని సన్మానిస్తున్న విశ్వనాథ్ గౌడ్

మహేశ్వరం: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీదే గెలుపు అని రంగారెడ్డి జిల్లా బీజేవైఎం కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్ గౌడ్ పేర్కొన్నారు. బడంగ్‌పేట్‌లో జరిగిన మహేశ్వరం నియోజకవర్గం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి మంగళవారం ఆయన మామిడిపల్లి నుంచి కార్యకర్తలతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. అనంతరం విశ్వనాథ్ గౌడ్ మాట్లాడుతూ గడిచిన పదేళ్లల్లో దేశానికి సుస్థిర పాలన అందించిన మోడీకే ప్రజలు పట్టం గడుతారన్నారు. తెలంగాణలో కూడా మెజార్టీ సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

చల్లాకు సన్మానం



చల్లా నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి

బడంగ్‌పేట్: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని ప్రభుత్వం అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా పలువురు నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా ఉండి పనిచేశారన్నారు. సరైన సమయంలో పార్టీ గుర్తించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రాళ్లగూడం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, విజయ్‌కుమార్, కుమార్, చందుచారి తదితరులు పాల్గొన్నారు.

చల్లగా చూడు తల్లి.. మావురాల ఎల్లమ్మ



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: చల్లగా చూడు తల్లి.. మావురాల ఎల్లమ్మ అంటూ రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక శ్రీ సత్యానారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కొందుర్గు: దివ్యశక్తి పేపర్ పరిశ్రమ ఆధ్వర్యంలో కొందుర్గు బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ సునీల్ బురాన్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం ప్రతి వేసవి సమయంలో కొందుర్గు బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. చలివేంద్రాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు సతీశ్, శ్రీనివాస్, వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు రామయ్యగౌడ్, రామస్వామి పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

షాబాద్: రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని దేవునిగడ్డ, వెంకమ్మగూడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు టీకాలు, వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులున్నారు.

ప్రమాదాలకు ‘రహదారి’



ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ స్తంభం



తిమ్మాపూర్‌లో రోడ్డు మధ్యలో..



బాట మధ్యలో వేసిన విద్యుత్ స్తంభాలు

నిర్లక్ష్యంగా రోడ్ల నిర్మాణం

- మధ్యలో విద్యుత్ స్తంభాలు
- ఇష్టానుసారంగా పనులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు, స్థానికులు

కందుకూరు: ఏదైనా రహదారి నిర్మాణం చేపట్టినప్పుడు ఏమైనా అడ్డుగా ఉంటే తొలగించి నిర్మాణాలు చేపట్టడం సహజం. కానీ ఇక్కడ చేపట్టిన రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం కనిపిస్తుంది. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా అధికారులు ఇష్టానుసారంగా పనులు చేపట్టారు. ఈ విషయాన్ని తిమ్మాపూర్ గ్రామస్తులు ప్రశ్నించి, పనులను అడ్డుకున్నా విస్తరణ పనులు మాత్రం చేపడుతున్నారు. స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

రోడ్డు విస్తరణ..

తుక్కుగూడ మున్సిపాలిటీ శ్రీశైలం హైవే రావిర్యాల గేట్ నుంచి కొంగర, తిమ్మాపూర్, మాదాపూర్, గుమ్మడవెల్లి, ఆకులమైలారం గ్రామాల మీదుగా మీర్కాన్‌పేట వరకూ ఆర్‌అండ్‌బీ రహదారిని నిర్మిస్తున్నారు. నిర్మాణం చేపట్టే క్రమంలో రోడ్డును విస్తరిస్తున్నారు. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను పక్కకు తొలగించకుండానే పనులు చేపడుతున్నారు. మరో పక్క ఎస్సీ కాలనీలో వర్షపు నీరు, మురుగు వెళ్లేలా డ్రైనేజీ నిర్మాణం చేపట్టకుండా కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై ఫిబ్రవరిలో అక్కడి కాలనీ వాసులు పనులను అడ్డుకుని ఆందోళనలు చేశారు. డ్రైనేజీ నిర్మించకుండా రహదారి నిర్మిస్తే వర్షాలు కురిసేటప్పుడు తమ ఇళ్లను ముంచెత్తుతుందని అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్య పరిష్కారం కాలేదు.

డ్రైనేజీ పనులు చేపట్టాలి



రహదారి విస్తరణ సందర్భంగా రోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించకుండా నిర్మాణం చేపడుతున్నారు. ఈ విషయంలో అధికారులు పట్టించుకోవాలి. వర్షం నీరు, మురుగు వెళ్లేలా డ్రైనేజీ పనులు చేపట్టాలి.

– శ్రీలతయాదగిరి, మాజీ వార్డు సభ్యురాలు, తిమ్మాపూర్

ప్రమాదాలు నివారించాలి



విద్యుత్ స్తంభాలు తొలగించకుండా హడావిడిగా రహదారి పనులు చేపడుతున్నారు. ఇక్కడ ప్రమాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు. అనుకోని సంఘటన జరిగితే బాధ్యులెవరు. కాబట్టి ముందుగానే ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త తీసుకోవాలి. అధికారులు ఈ విషయంలో స్పందించాలి.

– నల్ల నర్సింహా, గ్రామస్తుడు, తిమ్మాపూర్

‘మల్లు’ ఆశయ సాధనకు కృషి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్

కందుకూరు: మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుబ్బాక రాంచందర్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, బానిసల విముక్తి కోసం బాల్యంలోనే తుపాకి చేతబట్టి గెరిల్లా పోరాటం చేసిన మహనీయురాలు మల్లు స్వరాజ్యమని కొనియాడారు. పేద సంక్షేమానికి ఆమె చేసిన సేవ మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్‌చందు, ఎ.కుమార్, శేఖర్, రమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నియమావళి అతిక్రమిస్తే చర్యలు

ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మహేశ్వరం ఎంపీడీఓ పి శైలజ పేర్కొన్నారు. మంగళవారం అమీర్‌పేట్ గ్రామాన్ని సందర్శించి ఎన్నికల ప్రవర్తన నియమావళి కోడ్ అమలులోకి వచ్చినందుకు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఉండొద్దని వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. గోడలకు వాల్ రీడింగ్‌లను తుడిచివేయాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. రోడ్లపైన, ఇళ్ల మధ్యన చెత్తా, చెదారం ఉండకుండా శుభ్రం చేయించాలని కోరారు. అంతకు ముందు పలు వార్డుల్లో సందర్శించి ఎన్నికల కోడ్ నియమావళి గురించి వివిధ పార్టీల నాయకులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చక్రధర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



వాల్ రీడింగ్‌ను తొలగిస్తున్న ఎంపీడీఓ శైలజ

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్‌రూరల్: పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవని సీడీపీఓ నాగమణి అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డకు పోత పాలను కాకుండా తల్లి పాలను ఇవ్వాలన్నారు. బిడ్డ జన్మించిన కొద్ది వ్యవధిలోనే ముర్రుపాలను పట్టించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గర్భిణులు పాలు, పండ్లు, ఆకు కూరలు, గుడ్లు వంటి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు.పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే తల్లి, బిడ్డలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



కందుకూరు చౌరస్తాలో కవాతులో సీఐ మక్బూల్‌జానీ

కందుకూరు: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని సీఐ మక్బూల్‌జానీ కోరారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు రాచులూరు, బేగంపేట, తిమ్మాపూర్ గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకునేలా పోలీసులు సహకరిస్తారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శ్రావణ్, వెంకటయ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుందాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



తీగల కృష్ణారెడ్డిని కలిసిన రంజిత్‌రెడ్డి అనుచులు, మద్దతుదారులు

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని మీర్‌పేట మాజీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ అధికారంలోకొచ్చిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఎంపీ టికెట్ ఎవరికి కేటాయించినా కాంగ్రెస్ గెలుపు కోసం అందరూ కలసికట్టుగా పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో బేర బాలకిషన్, అరవింద్ కుమార్, సరికొండ పాండు, మల్లేశ్, మద్ది కరుణాకర్‌రెడ్డి, పల్లె పాండుగౌడ్, జెటావత్ రవినాయక్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీ స్థానం కాంగ్రెస్‌దే

మహేశ్వరం: చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకొని సోనియమ్మకు కానుకగా ఇస్తామని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు రంజిత్‌రెడ్డికి మద్దతుగా తాము కూడా కాంగ్రెస్‌లో చేరుతామని తీగలను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు భారీ అధిక్యం తీసుకోస్తామన్నారు. చేవెళ్ల ఎంపీ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి సోనియా గాంధీకి కానుకగా ఇస్తామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలంగాణ ఇచ్చిన పార్టీకే పట్టం కడుతారన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి పార్టీలోకి చేరడంతో కాంగ్రెస్ మరింత బలంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మద్ది కరుణాకర్‌రెడ్డి, పరిగి రాఘవేందర్‌రెడ్డి, బోద జైపాల్‌రెడ్డి, బొర్ర జగన్‌రెడ్డి, అంద్యా నాయక్, వర్కల యాదగిరి గౌడ్, రాకేష్‌రెడ్డి, అరవింద్, బాలకిషన్, సదానంద్ గౌడ్ పలువురు పాల్గొన్నారు.

చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్

టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం

షాద్‌నగర్: విద్యార్థులు చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందని రాయికల్ టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం అన్నారు. మండల పరిధిలోని రాయికల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసడక్, జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ వే వారి ఆధ్వర్యంలో రూ.9.85లక్షలతో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీం మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు తమవంతు సేవ చేయాలనే లక్ష్యంతో సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాయలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది విశ్వనాథ్ రాజు, బిజోయ్ బాబు, జగదీశ్, నరేశ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం జయమ్మ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం, తదితరులు

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



ఆలయ నిర్వాహకులతో జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సంమృద్ధిగా పండాలని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గొల్లూరుగూడలో మల్లన్న, బీరప్ప బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సవాల కోసం రూ.50వేల నగదును గ్రామస్తులకు విరాళం అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా మల్లన్న, బీరప్ప బోనాలు, కల్యాణం జరిగింది. ఉదయం నుంచి భక్తులు ఆలయాల వద్ద బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు బోనాలతో తరలివచ్చి నైవేద్యాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని మొక్కులు తీర్చుకున్నారు. మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

‘బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం’

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని టీఎల్ఎఫ్ రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు పీసరి సతీశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల గడ్డపై మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో గెలవడం ఖాయమన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగితే ఢిల్లీలో ప్రశ్నించేందుకు గులాబీ కండువా ఉండాలని, అందుకోసం లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. లోక్‌సభలో గళం విప్పాలంటే మనం ఎక్కువ ఎంపీ సీట్లు సాధించాలని, అందుకు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అందరికీ అన్నీ ఇస్తామని, ఇప్పుడు మాత్రం కొందరికి కొన్నే అంటుందని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో ఇప్పటికీ రైతులు రైతుబంధు రాక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికీ వాటి ఊసే లేదన్నారు.

నాయిబ్రాహ్మణ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న మల్లేశ్

నందిగామ: నాయీ బ్రాహ్మణులు ఐకమత్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలని ఆ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు మంగలి మల్లేశ్ అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో మంగళవారం నాయీబ్రాహ్మణ సంఘం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన మల్లేశ్ మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నాయీ బ్రాహ్మణులందరూ ఏకతాటిపై ఉండాలన్నారు. ఉపాధ్యక్షుడిగా మంగలి రవి, కార్యదర్శిగా మంగలి అశోక్, సభ్యులుగా వెంకటేశ్, లక్ష్మణ్, రాజు, సుధాకర్, రాంచంద్రయ్య ఎన్నికయ్యారు.

విద్యార్థికి అభినందన

కొందుర్గు: కరాటే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నందిగామలో మంగళవారం నిర్వహించిన కరాటే పోటీల్లో జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిర ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటింది. విద్యార్థిని అశ్విని అండర్ 12 కటాస్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు మాస్టర్ రాజు తెలిపారు. హెచ్‌ఎం శ్రీరాములు ఉపాధ్యాయులు ఖాదర్, కిషన్, వేణుకుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యాన్ని నిర్మిస్తాం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: తెలంగాణలో ఇందిరమ్మ కలలుగన్న రాజ్యాన్ని నిర్మిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నుస్రత్ రుక్సానా బేగం, గంట్లవెల్లి మాజీ సర్పంచ్ కర్రోళ్ళ యాదమ్మ, మాజీ ఉపసర్పంచ్ సునీతతో పాటుగా, కేశంపేట మండలం బొదనంపల్లి గ్రామానికి చెందిన సుమారు 90 మంది నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ కలలుగన్న రాజ్యాన్ని నిర్మించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, గూడ వీరేశం, బాలకృష్ణ, పాండు, చాకలి మల్లేశ్, సాయి, నర్సింహ్మా, రమేశ్, మహ్మద్‌ఖాజా, రాజ్‌గౌడ్, లయక్‌అహ్మద్, సయ్యద్‌గౌస్, రాములు, ఇబ్రహీం, అహ్మద్, శ్రీను నాయక్, రాజునాయక్, తులసీరాం, వజ్రలింగం తదితరులు పాల్గొన్నారు.